
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 28 జూన్ 2024



నేడు బాధ్యతలు చేపట్టనున్న కలెక్టర్ నాగరాణి



భీమవరం టౌన్, జూన్ 27 : పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా సి.నాగరాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమెను జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆమె 2011 నుంచి 2014 వరకు ఐటీడీఏ పీవోగా, తర్వాత గ్రామీణ ఉపాధి హామీ పనుల డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. చేనేత, జౌళి శాఖ డైరెక్టర్‌గా 2022 ఆగస్టు వరకు విధుల్లో ఉన్నారు. ప్రస్తుతం సాంకేతిక విద్యా విభాగానికి డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. తాజా బదిలీల్లో జిల్లా కలెక్టర్‌గా నియమించారు. జిల్లాల పునర్విభజన తర్వాత తొలిసారిగా మహిళా కలెక్టర్‌గా పి.ప్రశాంతి 2022 ఏప్రిల్ 4 నుంచి 2024 ఫిబ్రవరి 17 వరకు పని చేశారు. ఈమె బదిలీ అనంతరం జిల్లా కలెక్టర్‌గా సుమిత్ కుమార్‌ను నియమించారు. ఎన్నికల సమయంలో 2024 ఫిబ్రవరి 20 నుంచి పనిచేశారు. తాజా బదిలీల్లో ఆయనను చిత్తూరు కలెక్టర్‌గా బదిలీ చేశారు.

• మావుళ్లమ్మకు విశాఖ మహిళల సారె

భీమవరం టౌన్, జూన్ 27 : మావుళ్లమ్మ జ్యేష్ఠ మాస జాతర సందర్భంగా విశాఖపట్టణానికి చెందిన హేమ లత, భక్త బృందం సభ్యులు గురువారం అమ్మవారికి సారె సమర్పించారు. గాజులు, పసుపుతో అలంకరించిన పాదాలు, వివిధ రకాల పండ్లు, స్వీట్స్, గాజులు, పసుపు కొమ్ములు, యాలకులు, నెమలి ఈకలతో తయారు చేసిన దండలను అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు నిర్వహించి, వారు తెచ్చిన దండలను అమ్మవారికి అలంకరించారు. అనంతరం మహిళలు లలిత సహస్ర నామ పారాయణం, కోలాటం నిర్వహించారు. ఈవో బుద్ద మహాలక్ష్మి నగేష్ దేవస్థానం తరుపున శేష వస్త్రాలను అందించారు.





అమ్మవారికి పూజలు







వైభవంగా మావుళ్లమ్మ జ్యేష్ఠమాస జాతర

7



భీమవరం మండలంలో వర్షపు నీటితో మునిగిన సార్వా నారుమడి

ముంపు భయం

ఎడతెరిపిలేని వాన.. మునిగిన నారుమడులు
వేసింది 1,500 ఎకరాలు.. వేయాల్సింది 3,500 ఎకరాలు
పొలాల్లో నీరు వెళ్లే దారిలేక అవస్థలు

భీమవరం రూరల్/తాడేపల్లిగూడెం రూరల్ /పెనుమంట్ర, జూన్ 27 : రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా గురువారం తెల్లవారు జాము నుంచి జోరున వర్షాలు కురుస్తున్నాయి.ఎడతెరిపి లేని వర్షంతో చేలల్లో నీరు భారీగా నిలిచింది. సార్వా నారుమడులకు ముంపు భయం మొదలైంది. నాలుగు రోజులుగా వేసిన నారుమడులు ఇప్పటికే మునిగాయి. ముందస్తుగా వేసిన నారుమడులు ముంపు అంచున ఉన్నాయి. జిల్లాలో రెండు లక్షల 11 వేల ఎకరాల్లో సార్వా సాగుకు ఐదు వేల ఎకరాలలో నారుమడులు వేయాల్సి ఉండగా, తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు, గణపవరం మండలాల్లో ఎక్కువ శాతం నారుమడులు పడ్డాయి. మిగిలిన ప్రాంతాలలో కొంత వరకే వేశారు. ఇప్పటి వరకు 1500 ఎకరాల్లో పడగా, 3,500 ఎకరాల్లో వేయాల్సి ఉంది. వర్షాల వలన తక్కువ శాతం నారుమడులు ముంపునకు గురయ్యాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇంకా వర్షం కొనసాగడంతో పంట భూములలో వర్షపు నీరు పెరిగి మరోవారం వరకు నారుమడులు వేసే వీలుండదు. తాడేపల్లిగూడెం మండలంలో నారుమడులు నీట మునిగాయి. అవుట్ లెట్ లేని పంట బోదెల కారణంగా డెల్టాలో నారుమడులు మునుగుతుంటే, బోర్ల కింద సాగు చేసే చోట్ల పల్లపు ప్రాంతాల్లో నీరు చేరి నారుమడులు కుళ్లే పరిస్థితి కనిపిస్తోంది. మోదుగగుంట, ఉప్పరగూడెం, ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం ప్రాంతాల్లో వర్షం నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక పంట చేలు చెరువులను తలపిస్తున్నాయి. నవాబుపాలెం, కొత్తూరు, ఆరుగొలను గ్రామాల్లో రైల్వే ట్రాక్, ఏలూరు కెనాల్‌కు మధ్య ఉన్న 300 ఎకరాల్లో నారుమడులు నీటమునిగి దెబ్బతినే పరిస్థితి తలెత్తింది. కాలువ నీరు లెవల్ తగ్గించకపోతే నారుమడులు కుళ్లిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుమంట్ర మండలం పాలమూరు బాడవ ప్రాంతం ముంపునకు గురైంది. డ్రెయినేజీ తూడుతో పూడుకుపోవడంతో మురుగునీరు వెళ్లే దారిలేక పంట పొలాల్లో నారుమడులు ముంపునకు గురయ్యాయి.

పల్లపు ప్రాంతాలు జలమయం

పాలకొల్లు అర్బన్/తణుకు/అత్తిలి/పెంటపాడు/ ఆచంట/ఆకివీడు/ పాలకోడేరు జూన్, 27 : బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకూ ఒక మోస్తరుగా వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు చిరు జల్లులు పడుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం 11 గంటల వరకూ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాయంత్రం వరకూ చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. పాలకొల్లు పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, ఎల్ఆర్‌పేట, వెలమగూడెం, కొత్తపేట కొత్తకాలనీ, క్రిస్టియన్ పేట, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో వర్షానికి డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. పల్లపు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. చిరు వ్యాపారులు వ్యాపారాలు లేక ఇబ్బందిపడ్డారు. హమాలీలు పనుల్లేక షాపుల అరుగులపై కూర్చున్నారు. కొన్ని రోజులుగా ఉక్కబోత, ఎండలు ఎక్కువగా ఉండటంతో అల్లాడిపోతున్న తరుణంలో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. తణుకు, పెంటపాడు, ఆచంట తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు జన జీవనం స్తంభించింది. రహదారులు జలమయమయ్యాయి. ఆకివీడులో సీసీ రోడ్లు, జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచింది. ప్రధాన మురుగు బోదెలైన అందేవారిబోదె, గంగానమ్మకోడ్, మూలలంకబోదెలు తూడు, చెత్తలతో పూడుకుపోవడంతో రోడ్లపైనే నీరు నిలిచిపోతోంది. అత్తిలిలో డ్రైనేజీ వ్యవస్థ లేని మట్టపర్తి గరువు, ఎన్టీఆర్ నగర్, రైల్వే స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. వర్షంతో రైతులు దుక్కు దున్ని నారుమళ్ళ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెన్నాడ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, కొన్నిచోట్ల రహదారులు వెయ్యకపోవడం, వేసిన రహదారులు పల్లంగా ఉండటంతో గురువారం కురిసిన వర్షానికి జలమయమయ్యాయి. ఏ ప్రాంతం చూసిన వర్షపునీటితో చెరువులను తలపించే విధంగా ఉన్నాయి. పెన్నాడ గ్రామంతో పాటు గొల్లలకోడేరు, వేంద్ర, గొరగనమూడి, పాలకోడేరు, తదితర గ్రామాల్లో చిన్నపాటి వర్షానికే ఎక్కడ నీరు అక్కడే నిలిచి పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



భీమవరం, ఆచంటలో వర్షం

నరసాపురంలో అత్యధికంగా 87 మి.మీ వర్షపాతం

భీమవరం టౌన్, జూన్ 27 : గురువారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి జనజీవనానికి ఆటంకం కలిగింది. జిల్లాలో నరసాపురంలో అత్యధికంగా 87 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, అత్యల్పంగా తణుకులో 9.4 మి.మీ కురిసింది. పాలకొల్లులో 72.4 మి.మీ, పెనుమంట్ర 37.8, పెనుగొండ 38.2, ఆచంట 38, పోడూరు 30.4, మొగల్తూరు 24.6, గణపవరం 46.4, ఆకివీడు 47.4, ఉండి 68.8, పాలకోడేరు 52.2, వీరవాసరం 59.2, భీమవరం 70.4, కాళ్ల 40.2, తాడేపల్లిగూడెం 19.4, పెంటపాడు 17.4, అత్తిలి 25.2, ఇరగవరం 16.2 మి.మీ వర్షపాతం నమోదైంది.







ఆకివీడులో రహదారి జలమయం... పాలకోడేరు మండలం పెన్నాడలో.. పెంటపాడు పాత పంచాయతీ వద్ద ..



నవాబుపాలెం వద్ద వరి చేల పరిస్థితి

అక్రమ కట్టడాలపై కొరడా

181 మందికి నోటీసులు ఇచ్చిన మునిసిపల్ అధికారులు

నరసాపురం, జూన్ 27: గత ప్రభుత్వ హయాంలో నరసాపురం పట్టణంలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగాయి. కొందరు అధికార పార్టీ నేతల అండదండలతో నిబంధనలను తుంగలోకి తొక్కి నిర్మాణాలు చేపట్టారు. మొదట రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని వాటిపై రెండు, మూడు అంతస్తులు వేశారు. మరికొందరు తీసుకున్న అనుమతులకు, కట్టిన కట్టడాలకు పొంతన లేదు. కొన్ని భవనాలకు కనీసం సెట్‌బ్యాక్ కూడా విడిచిపెట్టలేదు. జాతీయ రహదారికి కనీసం పది అడుగులు కూడా విడిచిపెట్టకుండా నిర్మాణాలు చేపట్టారు. ఇరుకు సందుల్లో భవనాలు వెలిశాయి. అప్పట్లో అధికార పార్టీ నేతలకు భయపడి కొందరు అధికారులు నోటీసులు జారీ చేసేందుకు వెనుకంజ వేశారు. మరికొందరు నోటీసులు ఇచ్చి నేతల ఆగ్రహానికి గురయ్యారు. ఇంకొందరు చేయలేక బదిలీపై వెళ్లిపోయారు. కొన్ని భవనాలకు అనుమతులు లేవన్న వాదనలు లేకపోలేదు. అయితే ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తడం, అధికారులకు ఫిర్యాదులు అందడంతో ఎట్టకేలకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది స్పందించారు. అనధికార నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 181 మందికి నోటీసులు ఇచ్చారు. వాటిలో 108 కట్టడాలకు సంబంధించి కోర్టులో కేసు కూడా ఫైల్ చేశారు. ఇటీవల ఒక నిర్మాణదారుడి నుంచి రూ.1.70 లక్షల జరిమానా కూడా వసూలు చేశారు. మరోవైపు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అధికారులు మరింత స్పీడ్ అయ్యారు. అనధికారికంగా కట్టే నిర్మాణాలను గుర్తించి నోటీసులు ఇచ్చే పనిలో పడ్డారు. రాష్ట్ర విభజన తరువాత నరసాపురం పట్టణ పరిధి పెరుగుతూ వచ్చింది. నిర్మాణాలు పెరగడంతో శివారు ప్రాంతాలు కాలనీలుగా మారుతున్నాయి.

ప్రస్తుతం అధికారుల లెక్కల ప్రకారం పట్టణ పరిధిలో 18,500 గృహాలున్నాయి. ఇటీవల అపార్టుమెంట్‌ల నిర్మాణాల సంఖ్య పెరిగింది. అయితే చాలా మంది తీసుకున్న ప్లాన్‌కు కట్టే నిర్మాణాలకు పొంతన ఉండటం లేదు. అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదు. బీపీఎస్ స్కీమ్‌లో పెనాల్టీ చెల్లించి రెగ్యులర్ చేసుకోవచ్చున్న ధీమాతో కట్టడాలు చేపడుతున్నారు. అపార్టుమెంట్, భారీ భవనాలు, షాపింగ్ దుకాణాలు కడుతున్నప్పుడు కొన్ని నిబంధనలు పాటించాలి. అయితే పట్టణంలో చాలా నిర్మాణాలు ఈ షరతులను లెక్క చేయడం లేదన్న వాదనలు లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని నోటీసులు ఇస్తుండటంపై అక్రమ కట్టడదారుల్లో గుబులు పుడుతోంది. దీనిపై కమిషనర్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ 'ఇప్పటి వరకు 181 మందికి నోటీసులు ఇచ్చాం. కోర్టులో ఛార్జీ షీట్‌లు కూడా వేస్తున్నాం. వస్తున్న ఫిర్యాదులను పరిశీలిస్తున్నా'మన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాల్లో 46 శాతం ఉత్తీర్ణత

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 27 : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలలో 46 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో బాలురు 3,729 మంది, బాలికలు 2,132 మంది మొత్తం 5,861 మంది పరీక్ష రాయగా వారిలో బాలురు 1,623 మంది, 1,085 మంది బాలికలు మొత్తం 2,708 మంది ఉత్తీర్ణత సాధించారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 27 నుంచి జూలై 1వ తేదీ వరకు సంబంధిత పాఠశాలల హెచ్ఎంలకు ఫీజు చెల్లించుకోవచ్చు. రీ కౌంటింగ్ ఒక సబ్జెక్ట్‌కు రూ.500 రీ వెరిఫికేషన్ సబ్జెక్ట్‌కు రూ.1,000 చెల్లించాలని డీఈవో నాగమణి పేర్కొన్నారు.



రెండు కుటుంబాల్లో చీకట్లు

కరెంట్ షాక్‌తో తాడేపల్లిగూడెంలో భార్యాభర్తలు.. ఈదరలో తల్లీకొడుకు మృతి

- 7లో..

1న పెన్షన్ల పంపిణీకి ఏర్పాటు

భీమవరం టౌన్, జూన్ 27: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని ఇన్‌చార్జి కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి పెన్షన్ల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ సమీక్ష నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ జిల్లాలో జూలై 1న పెన్షన్ల పంపిణీకి శనివారం బ్యాంకుల ద్వారా నిధులు విత్‌డ్రా చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారంలోపు వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా పెండింగ్‌లో ఉన్న హౌస్ హోల్డ్‌ల మ్యాపింగ్ పూర్తి చేస్తామన్నారు. పెన్షన్ల పంపిణీకి జిల్లా ఎస్పీతో మాట్లాడామని అవసరమైన పోలీసు బందోబస్తుకు చర్యలు చేపడతామన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా అభివృద్ధి అధికారి అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ వేణు గోపాల్, డీఎల్‌డీవో అప్పారావు, ఏపీవో టి.మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మొగల్తూరు పంచాయతీ కార్యాలయంలో ఫొటోలతో కూటమి నాయకులు

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు

మొగల్తూరు, జూన్ 27:ప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలు ఏర్పాటు చేశారు. మొగల్తూరు పంచాయతీ, గ్రామ సచివాలయాల్లో ఏర్పాటును సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, టీడీపీ మండల, గ్రామ అధ్యక్షులు గుబ్బల నాగరాజు, బస్వాని ఏడుకొండలు, రాంబాబు, జనసేన అధ్యక్షుడు గోపి, బాబి తదితరులు పరిశీలించారు.

రేపు జాతీయ లోక్ అదాలత్


సి.పురుషోత్తమ కుమార్

ఏలూరు క్రైం, జూన్ 27 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో, కొవ్వూరులో ఉన్న కోర్టులలో ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. పురుషోత్తమకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో ప్రాంసరీ నోటు దావాలు, ఆస్తిదావాలు, తనఖా, మోటారు వాహన ప్రమాద కేసులు, కార్మిక వివాదాలు, చిట్‌ఫండ్ సంబంధిత, ఆర్బిటేషన్ కింద రికవరీ కేసులు పరిష్కరిస్తామన్నారు. సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులు ఎన్‌హెచ్ఎఐ భూసేకరణ వ్యవహారాలు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, దాంపత్య హక్కుల పునరుద్ధరణ, నిర్వహణ, సంబంధిత సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలోని ఏలూరులో 9 బెంచ్‌లు, మరో 26 బెంచ్‌లు జిల్లాలో ఉన్న అన్ని మండల న్యాయసేవాధికార సంస్థలో ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, భీమవరం, నరసాపురంలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీలలో వీడియోకాన్ఫరెన్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. దూర ప్రదేశాలు ఉన్న కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు వారు ఉన్న ప్రదేశం నుంచే వీడియో కాన్ఫరెన్సుతో కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించదగిన వాటిని ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఏదైనా సమాచారం కావాలంటే ఏలూరులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఫోన్ నంబరు 08812-22455ను గాని వాట్సాప్ నంబరు 94409 01064లో సంప్రదించాలని సూచించారు.

ఏపీ పీజీ సెట్‌లో
పశ్చిమ, ఏలూరు జిల్లా టాపర్స్

విశాఖపట్నం, జూన్ 27(ఆంధ్రజ్యోతి):రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంట్రన్ టెస్ట్ (ఏపీ పీజీసెట్-2024) ఫలితాలను ఆంధ్ర విశ్వ విద్యాలయం అధికారులు గురువారం విడుదల చేశారు. మొత్తం 34 సబ్జెక్టుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 10 నుంచి 13 తేదీల మధ్య 24 కేంద్రాల్లో ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని టాప్ ర్యాంకులు సాధించిన పలువురి విద్యార్థుల వివరాలు.. బోటనీలో దెందులూరు మండలం కొమిరేపల్లికి చెందిన గుర్రం శృతి ఎనిమిదో ర్యాంకు, ఎడ్యుకేషన్‌లో పోడూరుకు చెందిన తన్నీడి దేవిక తొమ్మిదో ర్యాంకు, హిందీలో కొత్త పట్టిసీమకు చెందిన కోనాల వెంకన్నబాబు రెండో ర్యాంకు, లైఫ్ సైన్స్‌లో నరసాపురానికి చెందిన హన్నే కోరం, ఫిజికల్ సైన్స్‌లో పెనుగొండకు చెందిన అత్యం శ్రావణి 12వ ర్యాంకు, గుండుగొలనుకు చెందిన పాతురి ప్రసన్న 12వ ర్యాంకు, జువాలజీలో భీమవరానికి చెందిన నిమ్మగడ్డ రత్నశ్రీ, తెలుగులో చింతపర్రుకు చెందిన వీఎస్ఎస్‌కెఎస్ మల్లయ్య, గణపవరం మండలం ఎస్.కొండేపాడుకు చెందిన బి.సత్యవాణి నాలుగో ర్యాంకు, స్టాటిస్టిక్స్‌లో పి.మోహిత నాలుగో ర్యాంకు, భీమవరానికి చెందిన నక్కా నవ్యసుధ ఐదో ర్యాంకు, మండపాకకు చెందిన పైబోయిన శ్రావణి సుబ్రహ్మణ్యేశ్వరి 13వ ర్యాంకు సాధించారు.


పోలీసులకు నగదు రివార్డును అందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ప్రతిభ కనబర్చిన పోలీసులకు నగదు రివార్డులు

ఏలూరు క్రైం, జూన్ 27 : ఏలూరు జిల్లా ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసు దర్యాప్తులో ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించి నగదు రివార్డులను అందించారు. గురువారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో కైకలూరు రూరల్ సీఐ పి.కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకటకుమార్, హెడ్‌కానిస్టేబుల్ టి.శంకరరావు, కానిస్టేబుల్ నాగబాబులను ఆమె అభినందించి, నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

నాలుగు ఉద్యాన కేవీకేలకు పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రాల నాలుగు ఉత్తమ పురస్కారాలను శాస్త్రవేత్తలు అందుకున్నారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ సాంకేతిక పరిశోధన అనే ప్రయోగ సంస్థ, ఉద్యాన విశ్వవిద్యాలయం, కేంద్ర వాణిజ్య పంటల పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన యాన్యువల్ జోనల్ వర్క్‌షాప్‌లో ఈ అవార్డులు అందుకున్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరిలోని 72 కేవీకేల పనితీరును బట్టి ఈ అవార్డులు అందించారు. అవార్డుల్లో వెంకట్రామన్నగూడెం కేవీకేకు ఉత్తమ ఆర్య పథకం అమలు, ఉత్తమ చేపలు-రొయ్యల సాగు శిక్షణలు, ఉత్తమ ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటులో అవార్డులు అందుకోగా, తూర్పుగోదావరి జిల్లా కేవీకే పందిరిమామిడికి రబ్బరు సాగులో ఉత్తమ కార్యక్రమాలు, అత్యధిక నైపుణ్య శిక్షణ అమలులో అవార్డులు అందుకున్నారు.

రేపు నరసాపురంలో జాబ్ మేళా

భీమవరం అర్బన్, జూన్ 27: నరసాపురంలోని వైఎన్ కాలేజీలో ఈనెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కనకారావు, జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు తెలిపారు. ఈ జాబ్‌మేళా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో పేటీఎం, యాక్సిస్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, ఎపాక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ చేసిన యువతీయువకులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు 93935 75353 నంబరులో సంప్రదించాలన్నారు.

జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు వాయిదా

ఏలూరుసిటీ, జూన్ 27: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 27న జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు గురువారం తెలిపారు.

డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు
పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ నియామకం

ఏలూరుసిటీ, జూన్ 27: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌ని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీసీఎంఎస్ పర్సన్ ఇంచార్జిగా ఏలూరు జేసీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపు హుండీల ఆదాయం లెక్కింపు

ముదినేపల్లి, జూన్ 27 : మండలంలోని సింగరాయ పాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం హుండీల లెక్కింపు జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి నేల సంధ్య తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు భక్తుల నుంచి వచ్చిన కానుకలను లెక్కించనున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ స్కూళ్ల దందా..



యూనిఫాం.. ఐడీ కార్డు.. బుక్స్ అమ్మకాల్లో దోపిడీ

- రూ.20వేల నుంచి రూ.30 వేలు వీటి కొనుగోలుకే
- యూనిఫాం, టై, బుక్స్ అక్కడే కొనాలి
- ట్రేడ్ లైసెన్స్ ఉండదు.. జీఎస్‌టీ చెల్లించరు..
- బెంబేలెత్తుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- విద్యాశాఖ దృష్టి సారించాలని వినతి

రోజువారీ వేతనంపై జీవించే పారులు సైతం తమ పిల్లలను మంచి స్కూళ్లలో చదివించాలనే ఆశయాన్ని కొన్ని ప్రైవేట్ స్కూళ్లు క్యాష్ చేసుకుంటున్నాయి. స్కూల్ ఫీజులే కాకుండా విద్యార్థులకు అవసరమైన సమస్త సామగ్రి ఆయా కార్పొరేట్ స్కూళ్లలోనే కొనుగోలు చేయాలి. ఐడీ కార్డు, టై, బెల్ట్, సాక్స్, షూ, యూనిఫాం, పుస్తకాలు అన్ని అక్కడే కొనాలి. అత్యధిక శాతం కార్పొరేట్ స్కూళ్లలో వీటి ధరలు 50 నుంచి 60 శాతం అదనంగా ఉంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ స్కూళ్ల నిలువు దోపిడీని నియంత్రించాలని తదనుగుణంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతూ ఓ ప్రత్యేక కథనం.

- పాలకొల్లు

ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన పాఠ్య పుస్తకాలే ఉంటాయి. కార్పొరేట్ స్కూళ్లలో తాము సొంతంగా తయారు చేసుకున్న 'కరికులం' (సిలబస్) తయారు చేసి అమ్మకాలు జరుపుకుంటున్నారు. కార్పొరేట్ స్కూళ్లలో విద్యతో పాటు విద్యా సామగ్రి అమ్మకాలు జరిపితే ట్రేడ్ లైసెన్సు కలిగి ఉండాలి. జీఎస్‌టీ చెల్లించాలి. అధికశాతం స్కూళ్లలో ట్రేడ్ లైసెన్సు లేకుండా, జీఎస్‌టీ చెల్లించకుండానే విద్యాసామగ్రి అమ్మకాలు జరిపి కోట్లాది రూపాయలు దండుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఆయా కార్పొరేట్ స్కూళ్లు తయారు చేసుకున్న సొంత సిలబస్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలపై ఆయా స్కూళ్ల పేర్లు ముద్రించుకుంటున్నారు. ఆవిధంగా పేరు ముద్రిస్తే జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. వీటన్నిటినీ బేఖాతర్ చేస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్న కొన్ని కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు దోచేస్తున్నాయి.

ఎల్‌కేజీ నుంచే బాదుడు..

ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు విద్యనందించే కార్పొరేట్ స్కూళ్లలో పలుపేర్లతో ఫీజులు వసూలు చేస్తున్నారు. యూనిఫాం, ఐడీ కార్డు, పుస్తకాలకే రూ.20 వేల నుంచి రూ. 30 వేల వరకు అవుతుంది. తొలుత అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజు, ట్యూషన్ ఫీజు, ట్రాన్స్‌పోర్టు ఫీజు, లైబ్రరీ ఫీజు, క్రీడా సామగ్రి ఫీజు, ఈవిధంగా పలు రూపాలలో ఎల్‌కేజీ స్థాయి నుంచే లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. పలు కార్పొరేట్ స్కూళ్లలో క్రీడా మైదానాలు కనిపించవు. పీఈటీలు ఉండరు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని అత్యధిక కార్పొరేట్ స్కూళ్లలో ఇదే తీరు కొనసాగుతోంది. కనీసం వంద మంది విద్యార్థులకు ఒక ఫిజికల్ డైరెక్టర్ ఉండాలి, డ్రిల్ మాస్టర్‌గా పిలువబడే పీడీలను కొన్ని స్కూళ్ళలో కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించుకుంటున్నారు. ఒక ఫిజికల్ డైరెక్టర్ 5, 6 స్కూళ్ళలో డ్రిల్ క్లాసులకు హాజరైనట్టు నమోదు చేసుకుంటూ హాజరు పట్టికలు చూపిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఫిజికల్ డైరెక్టర్‌ను పూర్తిస్థాయిలో నియమిస్తే రూ. 25 వేల నుంచి 30 వేలు జీతం ఇవ్వాల్సి వస్తుందన్న ఉద్దేశంతో రూ.4 లేక 5 వేలు మాత్రమే ఇచ్చి అటెండెన్స్ రిజిస్ట్రర్లలో డ్రిల్ క్లాసు నిర్వహిస్తున్నట్టు చూపించుకుంటున్నారు.

జీఎస్‌టీని ఎగ్గొడుతున్న వైనం..

తమ పిల్లలను పెద్ద చదువులు చదివించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు కార్పొరేట్ స్కూళ్ళవైపు ఆకర్షితులవుతుంటే అదే అదనుగా కొన్ని స్కూళ్ళ యాజమాన్యాలు దోపిడీకి తెర తీస్తున్నాయి. ఒకవైపు ఫీజులతో పాటు ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్‌టీ వంటి వాటిని నొక్కేస్తున్నారు. సామాన్యశాస్త్రం, చరిత్ర వంటి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం తగ్గించి ఐఐటీ ఫౌండేషన్ పేరుతో ప్రత్యేక సిలబ స్ ఇవ్వడం వల్ల చరిత్ర, భౌగోళిక శాస్త్రంకు సంబంధించిన విషయాలపై విద్యార్థులకు అవగాహన ఉండడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

» మంత్రి లోకేశ్‌ను కలసిన ఉపాధ్యాయులకు హామీ


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న డీపీఆర్‌టీయూ నేత వెంకటేశ్వరరావు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 27 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి లోకేశ్‌ను డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర రావు కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీచర్లకు బోధనేతరపనులను తగ్గించి, బోధనకే పరిమితం చేయాలని కోరామన్నారు. జీవో 117 ఉత్తర్వులను రద్దుచేయాలని, ప్రాథమిక పాఠశాలలను 1-5వ తరగతి వరకు నిర్వహించాలని అభ్యర్థించామన్నారు. ఈ ఏడాది పాఠశాలల నిర్వహణకు మెయింటెనెన్స్ గ్రాంట్లను తక్షణం విడుదల చేయాలని కోరామన్నారు. మంత్రిని కలిసిన డీపీఆర్టీయూ నాయకులు డి.శ్రీను, ప్రభాకర్, జ్ఞానేశ్వర్, తదితరులున్నారు.

ఉమ్మడి జిల్లాకు 8 నాన్ ఏసీ స్లీపర్ బస్సులు రాక


స్టార్ లయినర్ ఆర్టీసీ బస్సు

భీమవరంటౌన్, జూన్ 27 : ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో కూడిన నాన్ ఏసీ సర్వీసులు నడిపేందుకు ఉమ్మడి పశ్చిమ జిల్లాకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ఎనిమిది బస్సులను కేయించారు. స్టార్ లయినర్ పేరిట ఉండే ఈ బస్సులు నాన్ ఏసీ స్లీపర్ బస్సులుగా అధికారులు పేర్కొంటున్నారు. వీటిలో ఏలూరు జిల్లా ఏలూరు డిపోకు 2, జంగారెడ్డిగూడెం డిపోకు 2, పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు-2, నరసాపురం-2 బస్సులు రానున్నాయి. మొదటి విడతగా ఏలూరు, తణుకు డిపోలకు బస్సులు వస్తాయని తెలిపారు. ఇప్పటివరకు సీటులతో కూడిన సర్వీసులను మాత్రమే ఆర్టీసీ నడుపుతోంది. గతంలో స్లీపర్ బస్సు భీమవరం డిపో నుంచి నడిపినా అంతగా ప్రయాణికుల నుంచి స్పందన రాకపోవడంతో సర్వీసును రద్దు చేశారు. ఇప్పుడు సరికొత్తగా కొత్త బస్సులతో ఈ సర్వీసులను నడపనున్నారు. ప్రయాణికుల స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

వైభవంగా మావుళ్లమ్మ జ్యేష్టమాస జాతర

» ఉత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు » ఆకట్టుకున్న కళాకారుల వేషధారణలు


అలంకరించిన వాహనం..ఉత్సవమూర్తికి హారతిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు


దప్పుకళాకారుల విన్యాసాలు


బుట్టబొమ్మలు


ఆలయం వద్ద సందడి

భీమవరంటౌన్, జూన్ 27 : నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, మావుళ్ళమ్మ ఉత్సవ కమిటీ దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అమ్మవారి జ్యేష్టమాస జాతరను వైభవంగా నిర్వహించారు. ఆసాదుల నృత్యాలు, బుట్టబొమ్మలు, డప్పు కళాకారులు, వేంకటేశ్వరస్వామి వేషధారణ, ఫుల్ బ్యాండ్ ట్రూపుతో ఉత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. అనంతరం గ్రామోత్సవానికి ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంలో అమ్మవారి ఉత్సవ మూర్తిని అలంకరించి ప్రత్యేక పూజలు చేసి హారతులిచ్చారు. కొబ్బరికాయ కొట్టి ఉత్సవాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. దేవస్థానం తరపున రెండు లక్షల రూపాయలను ఉత్సవాల నిమిత్తం నిర్వాహకులకు ఆయన అందజేశారు. ఆయనతో పాటు జనసేన ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు పూజలు చేశారు. కార్యక్రమంలో కోళ్ళ నాగేశ్వరరావు, రామాయణం గోవిందరావు, తూటరావు ఏడుకొండలు, కొప్పుల రంగారావు, రామాయణం సత్యనారాయణ, రామాయణం సత్యనారాయణ, మానేపల్లి భాస్కరరావు, రామాయణం శ్రీనివాసరావు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, వబిలిశెట్టి రామకృష్ణ, కాగిత వెంకటరమణ, బుద్ధ మహాలక్ష్మి, నగేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామోత్సవం మోటుపల్లి వారి వీధి మీదుగా పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగి ఆలయానికి చేరుకుంది.

క్రైం కార్నర్

• విద్యుత్ - విషాదం

రెండు కుటుంబాల్లో చీకట్లు

» కరెంట్ షాక్‌తో తాడేపల్లిగూడెంలో భార్యభర్తలు.. ఈదరలో తల్లీకొడుకు మృతి

మోటారు ఆన్‌చేసేందుకు వెళ్లి దంపతులు..


తాడేపల్లిగూడెంలో చనిపోయిన భార్యభర్తలు.. వెంకన్న,అన్నపూర్ణ (ఫైల్)


ఈదర గ్రామంలో తల్లీకుమారుడి మృతదేహాలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27: అప్పటివరకు ఎంతో ఆనందంగా ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ సొంత ఇంటినిర్మాణ పనులు చేసుకుని వెళ్లిన ఆ దంపతులను విద్యుత్ తీగలు బలితీసుకున్నాయి. విద్యుత్ షాక్ తగిలిన భార్యను కాపాడేందుకు వెళ్లిన భర్త కూడా విగతజీవిగా పడి మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం తాడేపల్లిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెం గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నివాసం ఉంటున్న గట్టిం వెంకన్న(60) ఇంటి నిర్మాణ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. గురువారం ఉదయం భార్య అన్నపూర్ణ (55)తో కలిసి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం చేసేందుకు వెళ్లి పనులు పూర్తి చేయించుకుని ఇంటికి వచ్చారు. మంచినీటి కోసం మోటారు ఆన్‌చేసేందుకు వెళ్లిన అన్నపూర్ణకు విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై కేకలు వేయగా కాపాడేందుకు వచ్చిన భర్త వెంకన్న కూడా అక్కడికక్కడే విగత జీవిగా పడిపోయాడు. స్థానికులు గమనించే సరికే ఇద్దరూ మృతి చెందారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. సంఘటనా స్థలం వద్ద మృతులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

విద్యుత్ వైరు తగిలి.. తల్లీకుమారుడు మృతి

ఆగిరిపల్లి, జూన్ 27: బట్టలు ఆరవేసేందుకు ఏర్పాటు చేసిన తీగకు విద్యుత్ ప్రవహించడంతో దానిని తాకిన దొండపాటి నాగరత్నం(60), ఆమె కుమారుడు రామదాసు(40) మృతి చెందిన ఘటన ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలో గురువారం జరిగింది. స్థానిక వణుకూరి ముత్యాలమ్మ ఇంటి ఎదురుగా నివాసముంటున్న దొండపాటి చంటి ఇంటి నుంచి కరెంటును వాడుకుంటున్నారు. దీనికి వారు ఉపయోగించిన విద్యుత్ వైరును నాగరత్నం బట్టలు ఆరేసుకునే ఇనుప స్తంభానికి చుట్టారు. ఆ స్తంభం ద్వారా బట్టలు ఆరవేసే తీగకు కరెంట్ ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో నాగరత్నం బట్టలు ఆరవేసేందుకు వెళ్లి తీగను పట్టుకోవ డంతో విద్యుదాఘానికి గురై కుప్పకూలి విగతజీవిగా మారింది. తల్లిని కాపాడేందుకు వచ్చిన కుమారుడు రామదాసు తీగను పట్టుకోవడంతో మృతి చెందాడు. నాగరత్నంకు భర్త, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమా రులు ఇద్దరూ పక్షవాతంతో బాధపడుతుండగా వారిలో రామదాసు గురువారం మృతి చెందాడు.

బస్సు ఢీకొని ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం

మరొకరికి గాయాలు

భీమవరం క్రైం, జూన్ 27 : ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు యువకుల్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా.. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. భీమవరం రూరల్ ఎస్ఐ రాజు తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం తుందుర్రు గ్రామానికి చెందిన కోయ రాజేంద్రరామ్(20) మద్రాసులో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఇటీవల స్వగ్రామం వచ్చారు. గురువారం రాత్రి అతడి స్నేహితుడు జ్ఞాన సత్యేంద్రతో కలిసి ద్విచక్ర వాహనంపై భీమవరం నుంచి తుందుర్రు వెళుతున్నారు. తాడేరు గ్రామ సమీపానికి వచ్చేసరికి వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు వారి వాహనాన్ని ఢీకొంది. ఇద్దరూ కింద పడిపోయారు. రాజేంద్రరామ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితునికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ రాజు అక్కడకు వెళ్ళి వివరాలు సేకరిస్తున్నారు.

రైలు నుంచి జారి పడి ఒకరి మృతి

భీమవరం క్రైం, జూన్ 27 : ఊరు, పేరు తెలియని సుమారు 20-25 ఏళ్ల వయసు గల పురుషుడు విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి రైల్వే కరెంట్ స్తంభం పక్కన పడి చనిపోయాడని భీమవరం రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు తెలుపు రంగుపై నీలం రంగు గడులు కల పొడుగు చేతుల చొక్కా, పసుపు ముక్కుపొడి రంగు గల ఫుల్ బనియన్, నలుపు రంగు సిమెంట్ రంగుల నిక్కరు, నీలం రంగు డ్రాయిర్, నలుపు రంగు ట్రాక్ ఫ్యాంట్, కుడి చేతికి స్టీల్ కడియం, ఐదు పేటల గల తాడు ధరించి ఉన్నాడు. పుట్టుమచ్చలు ఎడమ కాలు తొడమీద ఒక పుట్టుమచ్చ, ఎడమవైపు మెడ మీద ఒక పుట్టుమచ్చ, పిల్లిగడ్డం ఉంది. మృతుడి వివరాలు తెలిసిన వారు 99121 24213, 70939 39777 నంబర్లకు తెలపాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి సూరిబాబు తెలిపారు.

మోటారు సైక్లిస్టును ఢీకొట్టిన వ్యాన్

» మద్యం మత్తులో డ్రైవర్.. చికెన్ వ్యర్థాలతో పాటు మద్యం రవాణా

ఉంగుటూరు,జూన్ 27 :హైదరాబాదు నుంచి చికెన్ వ్యర్థాలతో తోకలపల్లి చేపల చెరువులకు వెళుతున్న బొలేరో వ్యాను డ్రైవర్ మద్యం తాగి వాహనం నడుపుతూ ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టిన ఘటన గురువారం ఉదయం జరిగింది. చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ తెలిపిన నారాయణపురం పెట్రోలు బంకు శివారులో వ్యాన్ ఢీకొట్టడంతో నారాయణపురానికి చెందిన మోటారు సైక్లిస్టు అప్పసాని వెంకటరత్నం అనే వ్యక్తి మోకాళ్ళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ వాహనంలో చికెన్ వ్యర్థాలతో పాటు మద్యాన్ని రవాణా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించి మద్యాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌తో పాటు వ్యాన్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.


శ్రీవారి ఆలయ హుండీల సొమ్మును లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీవారి హుండీ
ఆదాయం రూ.2.71 కోట్లు

ద్వారకాతిరుమల, జూన్ 27: చిన్న తిరుమలేశుని హుండీల ఆదాయం గడిచిన 24 రోజులకు గాను రూ.2.71 కోట్ల భారీ ఆదాయం సమకూరిందని ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని ప్రమోద కల్యాణమండపం ఆవరణలో గురువారం జరిగింది. అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ జరిగిన హుండీల లెక్కింపు ద్వారా రూ.2,71,10,144 నగదుతో పాటు భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 276 గ్రాముల బంగారం, 6.837 కేజీల వెండి, రద్దయిన పాతనోట్లు రూ.500(24), 1000(5), 2000(6)తో పాటుగా పలుదేశాల కరెన్సీ అధికంగా లభించింది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జూన్ 27 : జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన ఓ యువతి అదృశ్యమైందని ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని స్టేషన్ రైటర్ పీసీహెచ్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. తన కుమార్తె డిగ్రీ చదివి ఇంటి వద్దనే ఉంటుందని ఈనెల 26వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని చుట్టుపక్కల ఉన్న బంధువుల ఇళ్ల వద్ద ఆచూకీ లభించక పోవడంతో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బుట్టాయిగూడెం మండలం మర్లగూడెం గ్రామానికి చెందిన బండారు దిలీప్‌కుమార్ అనే యువకుడిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం, జూన్ 27 : అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ మంగయ్య తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన సాయిల వెంకటలక్ష్మికి మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన పెద్దపూడి వెంకట్రాజుకు 2022లో వివాహమైంది. వివాహ సమయంలో కట్నం రూపంలో మూడు లక్షల రూపాయల నగదు, మూడు కాసుల బంగారం, సారె ఇచ్చినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. వివాహానికి ముందే మద్యం, జూదం అలవాట్లు ఉన్న వెంకట్రాజు అదనపు కట్నం కోసం తరచూ వేధిస్తున్నాడని అతడితో కుటుంబ సభ్యులు కూడా సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

టైరు పేలి పామాయిల్ గెలల లారీ బోల్తా

» తప్పిన పెను ప్రమాదం

చింతలపూడి, జూన్ 27: పామాయిల్ గెలల లోడ్‌తో వస్తున్న లారీ కారును తప్పించబోయి టైరు పేలడంతో మలుపువద్ద బోల్తా పడిన ఘటన చింతలపూడి మండలం ప్రగడవరం వద్ద జరిగింది. గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగిన సమయంలో వాహనాలు, స్థానికులు లేకపోవడం పెద్ద ప్రమాదం తప్పింది. లారీలోని పామాయిల్ గెలలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. చింతలపూడి మండలం సీతానగరం ఫ్యాక్టరీకి నిత్యం పలు గ్రామాల నుంచి వందల సంఖ్యలో పామాయిల్ లోడు లారీలు కనెక్షన్ పాయింట్ల నుంచి తరలిస్తుంటారు. గుంతల రోడ్డు వల్ల ఒక్కోసారి గెలలు ఎగిరిపడి రోడ్లపై పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధిక లోడ్ వేయకుండా పైన పరదాలు కప్పి తీసుకువెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


బోల్తాపడిన లారీ

రబీ బకాయిలు చెల్లించాలి


తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

భీమవరం అర్బన్, జూన్ 27: తక్షణమే రబీ బకాయిలను చెల్లించి, ఎకరాకు ఇరవై వేల రూపాయలు సార్వా సాగుకు సాయమందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు గురువారం భీమవరం తహసీల్దార్ శివకుమార్‌కు వినతి పత్రం అందించారు. గత రబీ ధాన్యం బకాయిలు ఇప్పటికీ చెల్లించకపోవడం దారుణమన్నారు. మాసూళ్లు మొదలయ్యాయని 90శాతం సబ్సిడీతో విత్తనం, ఎరువులు,పురుగు మందుల అందజేయాలన్నారు. డ్రెయిన్లు ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.


సమావేశమైన భీమవరం కూటమి బీసీ నాయకులు

సూరిబాబుకు ఏఎంసీ చైర్మన్ ఇవ్వాలి

భీమవరం అర్బన్, జూన్ 27: భీమవరం నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బీసీ సంఘ నాయకుల సమావేశం చినరంగనిపాలెంలోని టీడీపీ రాష్ట్ర శెట్టిబలిజ సాధికార కమిటీ డైరెక్టరు బొక్కా సూరిబాబు నివాసం వద్ద నిర్వహించారు. కూటమి బీసీ నాయకులు మాట్లాడుతూ సూరిబాబుకు భీమవరం ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వలని కోరుతూ త్వరలోని భీమవరం ఎమ్మెల్యే అంజిబాబును కలవనున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకులు మామిడిశెట్టి ప్రసాదు, వీరమల్లు సూరిబాబు, చల్లబోయిన సుబ్బరావు, గోవింద్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఘనంగా హెలెన్ జయంతి


హెలెన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27: మూగ, చెవిటి, అంధత్వంతో పుట్టిన హెలెన్ వాసన, టచ్‌తో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని ఎంఈవో-2 పీఎంకే జ్యోతి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని భవిత దివ్యాంగుల కేంద్రం వద్ద హెలెన్ జయంతి సందర్భంగా డైమండ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెలెన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. లయన్స్ చైర్ పర్సన్ పేరిచర్ల మురళి కృష్ణంరాజు, సహిత విద్య సమన్వయ కర్త సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన బెనర్జీ



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను పద్మశాలి సంఘ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు బండారు బెనర్జిబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పద్మశాలి సంఘ సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ పేర్కొన్నారు. కొమ్ముగూడెం, పట్టింపాలెం గ్రామాల్లో గురువారం డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, సర్పంచ్ తాడేపల్లి బేబి, బొనిగే పోతన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 27: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు తెలిపారు. కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, అమృతపురం, ఇటుకులగుంట, ఎల్అగ్రహారం, కొండ్రుప్రోలు, కేఎస్ఎన్ కాలనీ, ట్రిడ్‌కో గృహాలు, మోదుగగుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెంలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

గణపవరం: వరదరాజపురం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తాడేపల్లిగూడెం ఈఈ వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గణపవరం, కొత్తపల్లి, జల్లికొమ్మర, వెలగపల్లి, వరదరాజపురం, అర్ధవరం, వల్లూరు, వాకపల్లి, ముగ్గళ్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

జంతువులను హింసించటం దారుణం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జూన్ 27 : మనుషులతోపాటు జంతువులకు కూడా ఎన్నో హక్కులు ఉంటాయని, వాటిని హింసించడం దారుణమని జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డా కె.మురళీకృష్ణ అన్నారు. జంతు హక్కుల పరిరక్షణపై బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ జంతు ప్రేమికులు మూగ జీవలను కుటుంబంలో సభ్యులుగా పెంచుతారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఈ ఎలీషా, అసిస్టెంట్ డైరెక్టర్ జి సత్యనారాయణ మాట్లాడుతూ జంతువుల పట్ల ఆదరణ చూపించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, నరహరిశెట్టి కృష్ణ, పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

భీమవరం టౌన్, జూన్ 27 : డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఈబి సీఐ కె.స్వరాజ్యలక్ష్మి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సీఎస్ఎన్ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. సీఐ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ సరదాగా అలవాటైన డ్రగ్స్ జీవితాలను నాశనం చేస్తుందని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 3 రోజులపాటు వివిధ పాఠశాల, కళాశాలల్లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల కార్యదర్శి చీడే సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఎండి సలీం ఖాన్, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

నేడు అన్నసమారాధన

భీమవరం టౌన్, జూన్ 27: టూ టౌన్‌లోని రామరాజు తోటలో మావుళ్ళమ్మ జాతర ముగింపు సందర్భంగా 28వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అఖండన సమారాధన నిర్వహిస్తున్నామని మావుళ్ళమ్మ సేవా సమితి అధ్యక్షురాలు రామాయణం వెంకటలక్ష్మి తులసి పార్వతి, కార్యదర్శి రేపూరి గోగురాజు తెలిపారు. ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత రామాయణం సుధీర్, మావుళ్ళమ్మ సేవా సమితి గౌరవాధ్యక్షుడు పంజా లక్ష్మణరావు, సభ్యులు కోరసిక వెంకటేశ్వరరావు, కొండేపూడి గణపతి, కోరసిక వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.




తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో సమావేశమైన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల.. ఎమ్మెల్యే అంజిబాబుకు జ్ఞాపిక అందిస్తున్న వడ్డి సుబ్బారావు

నిధుల కోసం ఆర్థిక మంత్రితో నిమ్మల భేటీ

పాలకొల్లు అర్బన్, జూన్ 27 : రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్ తదితరులతో జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు గురువారం వెలగపూడిలోని సచివాలయంలో కలిసి జలవనరుల శాఖకు అవసరమైన నిధులపై చర్చలు జరిపారు. ఈసందర్భంగా జలవనరుల శాఖకు కావలసిన నిధులు విడుదలకు ప్రాధాన్యం ఇవ్వాలని డాక్టర్ నిమ్మల ఆర్థిక మంత్రి కేశవ్‌ను కోరారు. ఈసమావేశంలో జలవనరుల శాఖ సలహాదారు ఎం వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ సి.నారాయణ రెడ్డి, ఏపీ ప్లానింగ్ కమిషన్ బోర్డు వైస్ చైర్మన్ కుటుంబరావు, పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహ మూర్తి తదితరులు ఉన్నారు.

మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తా: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 27 : నియోజకవర్గాన్ని మెడికల్ హబ్‌గా తీర్చి దిద్దుతామని, మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యం, ఆసుపత్రిలో మందులు తదితర వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సహకారంతో ఆసుపత్రిలో ప్రత్యేక సదుపాయాలతో పాటు అదనపు వైద్యుల నియామకానికి కృషి చేస్తానన్నారు. 600 పడకలు ఆసుపత్రికి చర్యలు తీసుకుంటామన్నారు.సూపరిడెంట్ సూర్యనారాయణమూర్తి, వర్తనపల్లి కాశి, పట్నాల రాంపండు, కాళ్ళ గోపి, ఎరుబండి సతీష్, యాదవ శివాజి, కిషోర్ సాయి జగదీష్, పైబోయిన వెంకటరామయ్య, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే రఘురామ సమీక్ష

కాళ్ల(ఉండి), జూన్ 27: నియోజకవర్గంలో రైతులకు సాగునీరు, ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించడమే తన లక్ష్యమని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం కాళ్ల మండలం పెదఅమిరం ఎమ్మెల్యే కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వెంకయ్యవయ్యేరు పంటకాలువపై ఆధారపడిన గ్రామాలకు కలుషిత నీరు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాల్వలు, డ్రెయిన్ల ప్రక్షాళనకు సిద్ధం కావాలన్నారు. పరిమెళ్ల నుంచి జువ్వలపాలెం వరకు రూ.30కోట్ల ప్రాజెక్టును తిరిగి పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే అంజిబాబుకు సత్కారం

వీరవాసరం(భీమవరంటౌన్) : వీరవాసరం మండలం నవుడూరులో జాతీయ స్ఫూర్తిని కలిగించే నేషనల్ ఫ్లాగ్ టవర్‌ను నిర్మించిన వడ్డి సుబ్బారావు గురువారం నాడు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును కలసి సత్కరించారు. ఫ్లాగ్ నమూనాతో ఉన్న చిత్రపటాన్ని అందించారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు వీరవల్లి చంద్రశేఖర్ కూడా ఉన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ



ఆచంట, జూన్ 27: వల్లూరు శివారు శీలంవారిపాలెంకు చెందిన నల్లా రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రేమే మార్గం సేవే లక్ష్యం పేరుతో నూతనంగా చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురువారం ట్రస్టు చైర్మన్ రాధాకృష్ణ పేద ప్రజలకు ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్టుగౌరవాధ్యక్షురాలు సావిత్రి, చింతపర్తి రాజేష్, అడపా హేమంత్, బి. ఉపేంద్ర, కుసుమే సత్యనారాయణ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మంత్రి అచ్చన్నాయుడును కలసిన మార్కెటింగ్ శాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

పెనుగొండ, జూన్ 27: సుమారు 28 సంవత్సరాల నుంచి మార్కెటింగ్ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సముచిత స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీల అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ కూనపరెడ్డి సుధాకర్‌రాజు అన్నారు. సుధాకర్‌రాజు ఆధ్వర్యంలో పలువురు పెనుగొండ, జిల్లాలోని పలువురు ఉద్యోగులు, సభ్యులు అమరావతిలోని వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ సహకార శాఖ మంత్రి అచ్చన్నాయుడును కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ రెగ్యుల్ చేయాలని మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వానికి ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా నిరాశే ఎదురైందన్నారు.

కాపులకు న్యాయం చేయాలి

పాలకొల్లు అర్బన్, జూన్ 27: రాష్ట్రంలో అధికార మార్పిడిలో కాపు నాయకుల పాత్ర గణనీయంగా ఉందని నియోజకవర్గ కాపు నాయకులు తెలిపారు. ఈమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు నియోజకవర్గ కాపు నాయకులు లేఖ రాసి, ప్రతులను పత్రికలకు విడుదల చేశారు. గత 5ఏళ్ళగా కాపు యువత నిరుద్యోగ సమస్యలను ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు కాపు, తెలగ, బలిజ సామాజిక వర్గంలో వెనుకబాటు తనం గమనించి ఇతర వర్గాల వారికి అన్యాయం జరగకుండా ఈబీసీలో రిజర్వేషన్లు కల్పించాలని వారు కోరారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తున్నందున తప్పని సరిగా 5శాతం రిజర్వేషన్ అంశాన్ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. నియోజకవర్గ నాయకులు వంగా నరసింహారావు, ముచ్చర్ల శ్రీరామ్ తదితరులు లేఖ రాశారు. లేఖ ప్రతులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకి అందజేశారు.

ఎన్‌సీసీ ఏర్పాటుకు ఎంపిక


బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు విచ్చేసిన ఎన్‌సీసీ స్టేట్ కల్నల్ ఎస్ ముఖర్జీ

అత్తిలి, జూన్ 27 : బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీసీ విభాగం ఏర్పాటుకు ఎంపికైందని హెచ్ఎం సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. పాఠశాలను ఎన్‌సీసీ స్టేట్ కల్నల్ ఎస్.ముఖర్జీ కమాండెంట్ ఆఫీసర్ బృందం గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి 8వ తరగతికి చెందిన 25 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఎన్‌సీసీ శిక్షణ ఇస్తారన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత


విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న వాసవి జాగృతి సభ్యులు

భీమవరం అర్బన్, జూన్ 27: వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని 22వ వార్డు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు హ్యాండ్ మైక్ సెట్‌ను అందించారు. అలాగే బీటెక్ చదువుతున్న ఆకెళ్ళ భార్గవికి క్లబ్ తరుపున రూ.25వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పరిపాటి శ్రీను, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, శ్రీనివాస్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం టౌన్, జూన్ 27: పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు జరిగే ఈసమావేశానికి చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షత వహిస్తారన్నారు.

చంద్రపాల్ కుటుంబానికి టీడీపీ అండ

నరసాపురం రూరల్, జూన్ 27: మండలంలోని కొప్పర్రు గ్రామంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన చంద్రపాల్ కుటుంబాన్ని గురువారం టీడీపీ నాయకులు పరామర్శించారు. చంద్రపాల్ పార్థీవదేహాన్ని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి టీడీపీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తామన్నారు.

పెండింగ్ కేసులు రాజీ అవ్వాలి


అధికారులతో సమీక్ష చేస్తున్న న్యాయమూర్తి గంగరాజు

నరసాపురం టౌన్, జూన్ 27: స్థానిక కోర్టు ప్రాంగణంలో గురువారం పోలీస్, ఇతర సిబ్బందితో సివిల్ జడ్జి జి.గంగరాజు సమీక్ష నిర్వహించారు. శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. సమన్వయంతో పోలీస్ అధికారులు పని చేసి పెండింగ్ కేసుల్ని తగ్గించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి కె.శ్రీనివాస్, సీఐ అప్పలస్వామి, ఏపీపీ ఎంఎ హమీద్, ఎస్సై గురవయ్య పాల్గొన్నారు.

సార్వా సాగు పనులు ప్రారంభం


రామన్నపాలెంలో వేసిన ఆకుమడులు

మొగల్తూరు, జూన్ 27: వర్షాలు సకాలంలో కురవకపోవడం, శివారు ప్రాంతాలకు కాలువలు వదిలినా సాగునీరందకపోవడం వంటి కారణాలతో ఈ ఏడాది సార్వా అలస్యంగా ప్రారంభమైంది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటం, కొద్దిపాటిగా సాగునీరు అందుతుండటంతో దుక్కులు దున్నేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలంలో సుమారు 980 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టవచ్చని వ్యవసాధికారులు అంచానా వేస్తున్నారు. రామన్నపాలెం గ్రామంలో కేవలం 30 ఎకరాల్లో మాత్రమే ఆకుమడులు సిద్ధం చేస్తున్నారని అధికారులు తెలిపారు. మరో వారం రోజుల్లో శేరేపాలెం, పేరుపాలెం, మొగల్తూరు గ్రామాల్లో నారుమడులు వేసుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆకుమడులు వేసుకోవడం ఆలస్యమైతే వెదజల్లే పద్ధతి పాటించాలన్నారు. కాలువలు వదిలినా ఇంకా నీరందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్త చెదారాలను తొలగించి పూర్తిస్థాయిలో సాగునీందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రజలంతా ఐక్యంగా ఉండాలి


శాంతి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ వి.భీమారావు

మొగల్తూరు, జూన్ 27: గ్రామాల్లో ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలని జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు సూచించారు. గురువారం రాత్రి మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో కొత్తపాలెం, శేరేపాలెం గ్రామాలకు నియమించే శాంతి కమిటీలు నుద్దేశించి మాట్లాడారు. జిల్లాలో 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి క్రిమినల్ కేసులు జిల్లాలో నమోదు కాలేదన్నారు. ప్రశాంతంగా ఉండే పశ్చిమ గోదావరి జిల్లాలకు మంచి పేరుందన్నారు. అయితే ఇటీవల కొన్ని గ్రామాల్లో ఆశాంతికి గురి చేసే సంఘటనలు జరుగుతున్నాయన్నారు. కొత్తపాలెంలో దివంగత ముఖ్యమంత్రి విగ్రహన్ని ధ్వంసం చేయడం, ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఉండే శిలాఫలకాలను ధ్వంసం చేయడం మంచి పరిణామం కాదన్నారు. ఇకపై ప్రతీ గ్రామంలోనూ శాంతి కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని గ్రామాల్లో ఉండే సమస్యలు, ఇబ్బందులు పోలీస్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ జి.శ్రీనివాసరావు, సీఐ గోవిందరాజు, ఎస్ఐ కె.వెంకట రమణ పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



ఉండి, జూన్ 27: జ్యేష్టమాసం పురస్కరించుకుని ఉండి కొత్తపేట సాయిబాబా ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రోక్షణ, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు జరిగాయి. దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

గ్రామదేవతల ఊరేగింపు


గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

ఆకివీడు, జూన్ 27:అయి-భీమవరంలో పోతురాజు సహిత పోలేరమ్మ, వీర్లవెంకమ్మల ఊరేగింపు గురువారం జరిగింది. పుట్టింటివారు గ్రామదేవతలకు పాన్పు అందజేశారు. జాతర ఈ నెల 29న జరుగుతుందని ఉత్సవ కమిటీ తెలిపింది. 30న నైవేద్యాలు ఉంటాయన్నారు.

కాల్వల అభివృద్ధికి రూ.లక్ష అందజేత


ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుకు రూ.లక్ష చెక్కు అందిస్తున్న జడ్పీటీసీ యండగండి శ్రీను

ఆకివీడు/ఉండి, జూన్ 27: పంట కాల్వలు, మురుగుబోదెల అభివృద్ధికి ఎమ్మెల్యే కనుమూరు రఘు రామ కృష్ణ రాజు చేపట్టిన స్వచ్ఛంద సహాయనిధికి జడ్పీటీసీ యండగండి శ్రీను గురువారం రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి


ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జూన్ 27 : ఆరోగ్య శ్రీ పథకంలో 16 ఏళ్ళగా ఆరోగ్య మిత్రలుగా పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచి ఆదుకోవాలని శాసనమండలి సభ్యులు కెఎస్ లక్ష్మణరావుకు ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తానని హామి ఇచ్చారు. ఆయనను కలసినవారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్‌ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు గాతల జేమ్స్, కార్యదర్శి సాగిరాజు సత్యనారాయణ రాజు, యూటీఎఫ్ జిల్లా సంఘం నాయకులు పట్టాభి రామయ్య ఉన్నారు.

ప్రమాదభరితంగా గోతులు



ఉండి, జూన్ 27: కురుస్తున్న వర్షాలకు ఆర్అండ్‌బి రహదారులు దెబ్బతిని గోతులుగా మారుతున్నాయి. ఉండి నుంచి వెలివర్రు వెళ్లే రహదారిలో గోతులు పడ్డాయి. ఈ గోతులు ప్రమాదభరితంగా మారాయి. దీనిని తక్షణమే పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు. చిలుకూరు దాటిన తరువాత ఆర్అండ్‌బి రహదారి గోతులమయంగా మారింది. గోతులమయంగా మారిన రహదారిని అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు.

మోటార్ సైక్లిస్ట్‌కు గాయాలు

ఉండి, జూన్ 27: భీమవరం నుంచి గణపవరం మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న ఆటోవాలా ఢీకొట్టాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈనెల 26వ తేదీన భీమవరం నుంచి గణపవరం మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఉండి మండలం కోలమూరు గ్రామం వెళ్లే సరికి గణపవరం నుంచి ఎదురుగా వస్తున్న ఆటోవాలా ఢీకొట్టాడు. దాంతో మోటార్ సైక్లిస్ట్ వెంకట సత్యనారాయణరాజు గాయపడ్డాడు. నిడమర్రు మండలం మందలపర్రు గ్రామానికి చెందిన సత్యనారాయణరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవార్చుకోవాలి

నరసాపురం టౌన్, జూన్ 27: విద్యార్థులు చదువులో పోటీతత్వాన్ని అలవార్చుకోవాలని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. గురువారం మిషన్‌హైస్కూల్‌లోని విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ వెంకటేశ్వరావు, ఎంఈవో పుష్పరాజ్యం, కొప్పాడ రవి, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, ఎం రవి, పద్మారావు, ఆనంద్, రాంబాబు, గంటా కృష్ణ, సూర్యకుమారి, కృష్ణవేణి పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్/రూరల్: 4వ వార్డులోని అల్లు వెంకట్రావు మునిసిపల్ ఎలిమెంట్రీ స్కూల్లో విద్యార్థులకు వార్డు మాజీ కౌన్సిలర్ జగ్గరోతు రాంబాబు పాఠ్య పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమానికి హెచ్ఎం శివ ప్రసాద్ అధ్యక్షత వహించారు.

మండలంలోని గోరింటాడ ఎంపీపీ పాఠశాలలు 1, 2ల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి, పాఠ్యపుస్తకాలను సర్పంచ్ మండెల పావనీ అందజేశారు హెచ్ఎం, భవానీ పాల్గొన్నారు. పాలమూరు ఎంపీపీ పాఠశాలలో సర్పంచ్ పంచదార వెంకట లక్ష్మీ, నారాయణ స్వామి నాయుడు, ఉప సర్పంచ్ టి.వర ప్రసాద్, హెచ్ఎం జి ప్రకాష్ పంపిణీ చేశారు.



పాలకొల్లు అల్లు వెంకట్రావు మునిసిపల్ స్కూల్లో పాఠ్య పుస్తకాలు అందిస్తున్న వార్డు నాయకులు

నరసాపురంలో విద్యార్థులకు పుస్తకాలందిస్తున్న ఎమ్మెల్యే బొమ్మిడి, పొత్తూరి